క్లుప్తంగా

మద్ది క్షేత్రానికి భక్తుల తాకిడి



మద్దిక్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఒక్కరోజు ఆదాయం రూ: 1,12,655 వచ్చినట్లు, 900 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది భక్తులకు వైద్య సేవలందించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి నైవేద్యం సమర్పణ



108 రకాల వంటకాలతో నైవేద్యం సమర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో వేంచేసియున్న శ్రీవేణుగోపాల స్వామి వారి దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు పార్థసారథి, లక్ష్మణాచార్యులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, 108 రకాల వంటకాలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. మహిళలు సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయం ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది లక్ష్మణరావు, భక్తులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ



సుబ్రహ్మణ్యేశ్వరుడికి నైవేద్యం సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని అశ్వారావుపేట రోడ్ రాజులకాలనీలో వేంచేసియున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. స్వామి వారికి భక్తులు నైవేద్యం సమర్పించారు. ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ అధ్యక్షుడు గండికోట బాబి మాట్లాడుతూ ప్రతీ మంగళవారం దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నారన్నారు. ఈ మంగళవారం ఈదుపల్లి సాయి వేంకట లోకే ష్ సహకారంతో అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు.

నేడు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



ప్రతిష్ఠకు సిద్ధం చేసిన ధ్వజ స్తంభం

కొయ్యలగూడెం: సరిపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం గ్రామస్తులు నిర్వహించనున్నారు. సుమారు 100 సంవత్సరాల ప్రాశస్త్యం కలిగిన ఆలయానికి గతంలో ఉండే ధ్వజ స్తంభం జీర్ణోద్ధారణ చెందడంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో దాతలు సమకూర్చిన విరాళాలతో గ్రానైట్ ధ్వజ స్తంభం సమకూర్చుకున్నారు. ఉదయం 8:11 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం నుంచి భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనధికార ఫ్లెక్సీలతో ప్రజల ఇక్కట్లు



డివైడర్ మధ్య ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఎటువంటి అనుమతులు లేకుండా డివైడర్ మధ్యలో ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్డు దాడే సమయంలో ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయడం వలన రోడ్డుకు మరో పక్క ఎవరు వస్తున్నారో అర్థం కాక ప్రజలు రోడ్డు దాటలేకపోతున్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ, అశ్వారావుపేట రోడ్డు మధ్య డివైడర్లలో అనధికార వ్యాపార ప్రకటనలు దర్శనమిస్తున్నారు. అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లుగా వ్యవహరించడంతో ప్రజలు వారి తీరును విమర్శిస్తున్నారు. మున్సిపల్, పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పందించాలని వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కఠిన చట్టాలు రూపొందించాలి



వైద్యుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించాలి. మేం ప్రజల ప్రాణాలను కాపాడటానికి రాత్రి, పగలు పని చేస్తుంటాం. ముఖ్యంగా మహిళా వైద్యులకు ప్రత్యేక రక్షణ అవసరం. కలకత్తాలో మహిళా వైద్య విద్యార్థినిపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించి వైద్యులకు, వైద్య సిబ్బందికి భరోసా కలిగించాలి.

–డాక్టర్ కిరణ్ చైతన్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాఘవాపురం

ప్రత్యేక భద్రత చట్టం అవసరం



కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక భద్రతా చట్టం తీసుకురావాలి. అలాగే విధుల విషయంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ గైడ్‌లైన్స్ తప్పక అమలు చేయాలి. వైద్యులపై పని ఒత్తిడి తగ్గించాలి, రోజుకు 8 నుంచి 10 గంటలు మాత్రమే పని ఉండేలా చూడాలి. అదే విధంగా కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతంకాకుండా బోధనాసుపత్రులలో పోలీస్ భద్రతను పెంచాలి.

– డాక్టర్ సంకు మురళీకృష్ణ, జనరల్ సర్జన్, జంగారెడ్డిగూడెం

ట్రాఫిక్ చట్రంలో ఏజెన్సీ ముఖద్వారం

గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న వైనం

కొయ్యలగూడెం: ట్రాఫిక్ చట్రంలో ఏజెన్సీ ముఖద్వారం విలవిలలాడుతోంది. ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి ప్రధాన కేంద్రమైన కొయ్యలగూడెం మీదుగానే పోలవరం, కొవ్వూరు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం ప్రధాన నగరాలకు రాకపోకలు సాగుతున్నాయి. అయితే జాతీయ రహదారి 516(డి) విస్తరణ తరువాత ట్రాఫిక్ సమస్యలు మరింత జటిలమయ్యాయి. దీనికి తోడు తాడేపల్లిగూడెం పోలవరం రోడ్లలో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. జాతీయ రహదారి విస్తరణ సమయంలో సర్వీసు రోడ్డు కూడా ఉంటుందని ఎస్టిమేషన్ సమయంలో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పేర్కొన్నారు. కానీ రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యమో, మరే కారణమో అది కార్యరూపం దాల్చలేదు. దీంతో ఉన్న రహదారినే ఇరువైపులా విస్తరణ చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. నేషనల్ హైవే 16తో పోల్చితే నేషనల్ హైవే 516 (డి) హైదరాబాద్ వెళ్లేందుకు అరవై కిలోమీటర్ల దూరం తగ్గడంతో అత్యంత భారీ వాహనాల నుంచి ఫోర్ వీలర్స్ వాహనాలకు కొయ్యలగూడెం మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. అదే విధంగా పోలవరం చేరుకోవడానికి ప్రధాన రహదారి కొయ్యలగూడెం కన్నాపురం మీదుగానే ప్రయాణించాల్సి ఉంది. కన్నాపురం రోడ్డు కూడా విస్తరణ చేపట్టి నిర్మించినప్పటికీ ఆక్రమణలకు గురి కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నుంచి గణేష్ సెంటర్ వరకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్తంభించిన ట్రాఫిక్ →



నిత్యం ట్రాఫిక్ జామ్



కొయ్యలగూడెం గణేష్ సెంటర్ నుంచి చెక్ పోస్ట్ సెంటర్ వరకు నిత్యం అన్ని వేళలా ట్రాఫిక్ జామ్ అవుతుంది. రహదారిపై ఒకవైపు నుండి మరోవైపు దాటడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి అని అప్పటివరకు కనీసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ప్రజలు కోరుతున్నారు.

- తేలే శ్రీనివాస్, ఎంపీటీసీ, మంగపతిదేవిపేట

అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బంది



కొయ్యలగూడెంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యల వలన అత్యవసర సమయాలలో సేవలను అందించే వాహనాలు సకాలంలో గమ్య స్థానాలకు చేరలేకపోతున్నాయి. ఇటీవల గణేష్ సెంటర్ నుంచి వెళ్లవలసిన అత్యవసర వాహనం గ్రామంలోని అంతర్గత రోడ్డు మీదుగా చేరుకోవాల్సి వచ్చింది. ఐటీడీఏకు, పోలవరం ప్రాజెక్టుకు వెళ్లే ఉన్నతాధికారులు, మంత్రులు సైతం ఈ విధంగానే బయటపడిన సందర్భాలు ఉన్నాయి.

- మద్దిబోయిన శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎస్సైని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: మండలం ఎస్‌హెచ్‌వోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సై వర్రె చంద్రశేఖర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, రాజవరం గ్రామ ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఇటీవల జరుగుతున్న దాడుల నేపథ్యంలో శాఖా పరంగా న్యాయబద్ధమైన చర్యలు చేపట్టాలని ఎస్సైని నాయకులు కోరారు. కొయ్యలగూడెం మండలంలోని అత్యంత సున్నితమైన, సమస్యాత్మక పంచాయతీలలో రాజవరం మొదటిదని, లా అండ్ ఆర్డర్ అమలు విషయంలో తమకు సహకరించాల్సిందిగా నాయకులను ఈ సందర్భంగా ఎస్సై కోరారు.



ఎస్సై చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కోరారు. స్థానిక వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు తమ డిమాండ్లను తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాంతీయ కార్యాలయాలను, సీఆర్‌యూలను రద్దు చేసి సర్కిల్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అంత వరకు బదిలీ ప్రక్రియను వాయిదా వేయాలని కోరారు. అలాగే రాజ్యాంగ వ్యతిరేకంగా చేసిన ఉద్యోగ బదిలీలను రద్దు చేయాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖలో అధికారాల కేంద్రీకరణకు స్వస్తి పలికి, వికేంద్రీకరణ దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ జాయింట్ సెక్రటరీ ఎ.వెంకటేశ్వరరావు, ఏపీజీఈఏ జంగారెడ్డిగూడెం తాలూకా సెక్రటరీ కె.సత్యనారాయణ, ఎం.జయరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

జంగారెడ్డిగూడెం: పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో ప్రధాన డ్రెయిన్ల పూడికతీత పనులను మంగళవారం ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన డ్రెయిన్లలో సిల్ట్ పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వర్షాలు కురుస్తున్నందున పట్టణంలో నీరు రోడ్లపై ప్రవహించకుండా మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తున్నామన్నారు. అపారిశుద్ధ్యం కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జ్వరాలు నమోదువుతున్నాయన్నారు. కావున ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పది రోజులుగా పట్టణంలో నిర్విరామంగా డ్రెయిన్ల పూడికతీత పనులు, పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బత్తిన చిన్న, కౌన్సిలర్ దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్లలో పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

కృత్రిమ కాలు అందజేత

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగేనగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగ వృద్ధుడికి మంగళవారం కృత్రిమ కాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకుడు అమృతల రంగా మాట్లాడుతూ స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన గద్దం రాంబాబుకు షుగర్ వ్యాధి వలన కుడికాలు తొలగించారని తెలిపారు. దీంతో అవస్థలు పడుతున్న గద్దం రాంబాబు దీన పరిస్థితి డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు నేలపోలు ప్రభాకర్‌రావు, సంఘ సభ్యులు అగాపే సంస్థ వ్యవస్థాపకులు బిరుదుగడ్డ ఆసిబాబుకు తెలియజేయగా సుమారు రూ.20 వేల విలువ గల కృత్రిమ కాలును దాతల సహకారంతో సమకూర్చారని తెలిపారు. మంగళవారం గద్దం రాంబాబు ఇంటి వద్ద కృత్రిమ కాలును అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘ గౌరవ అధ్యక్షుడు నేలపోలు ప్రభాకర్‌రావు, అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ వృద్ధునికి కృత్రిమ కాలు అందజేస్తున్న దృశ్యం

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

జంగారెడ్డిగూడెం: లక్ష్యాలను ఏర్పరుచుకుని విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో బి.రాముడు అన్నారు. జంగారెడ్డిగూడెం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కమిటీ ద్వారా తల్లిదండ్రులు లేని లేదా నిరాదరణకు గురైన బాల బాలికలను గుర్తిస్తామన్నారు. ఇలా గుర్తించిన 45 మంది లబ్ధిదారులకు 6 నెలలకు గాను రూ.24 వేలు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా జమ చేయడమైందన్నారు. ఈ పథకం ద్వారా బాలబాలికలు చదువును కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా బాలబాలికలు తమ లక్ష్యాలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీటీ వరలక్ష్మి, డీసీపీయూ సిబ్బంది పి.రాజేష్, వై.రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా, సూపర్‌వైజర్‌లో కె.లక్ష్మి, టి.మేరి, మణి, వీరకుమారి, మంగాదేవి, ఎం.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ వాత్సల్య కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జ్వరాలపై ఇంటింటి సర్వే

జంగారెడ్డిగూడెం: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని ఎస్‌పీవో రోజా పుష్పం అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో మంగళవారం జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా పుష్పం మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు పారిశుద్ధ్యాన్ని పాటించాలన్నారు. కాచి చల్లార్చి నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఎవరికైనా అస్వస్థత కలిగితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. పట్టణంలోని అశోక్ నగర్, బుట్టాయగూడెం రోడ్, విరోధుల వారి వీధి, మార్కండేయపురం, బైపాస్ రోడ్ ప్రాంతాల్లో జ్వరాలపై సర్వే నిర్వహించి ఆయా ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌వీ కృష్ణకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

సాహిత్య రచనకు సృజనాత్మక శక్తి కావాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శత జయంతి ప్రభుత్వ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్ విచ్చేసి ఉపన్యసించారు. విద్యార్థులకు సృజనాత్మక రచనలైన కవితా రచన, కథానిక రచన చేయటంలో మెలకువలను వివరించారు. సాహిత్య రచనకు సృజనాత్మక శక్తి కావాలని, అది ప్రతి ఒక్కరిలో దాగుంటుందని, దానిని బయటికి తీసి చక్కటి రచనలు చేయాలని తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు, సీనియర్ అధ్యాపకులు ఎం.మధు, యు.వెంకటాచార్యులు, ఎం.శ్రీనివాసరావు, టి.ఝాన్సీరాణి, వెంకటలక్ష్మి విజయ దీపిక తదితరులు తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. అనంతరం రమేష్ కార్తీక్ నాయక్‌ను «సాహిత్య పారిజాతం అవార్డు»తో సన్మానించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ జి.వెంకటలాల్, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాసం చేస్తున్న రమేష్ కార్తీక్ నాయక్

ఉపాధ్యాయుడిపై చర్యలేవి?

చింతలపూడి: పవిత్రమైన పాఠశాలలో బాలికల పట్ల జరుగుతున్న అమానవీయ సంఘటనలు దురదృష్టకరమని పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిడపర్తి ముత్తారెడ్డి అన్నారు. చింతలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇటీవల ఒక బాలికను ఉపాధ్యాయుడు సంపత్ కుమార్ వేధించిన సంఘటనపై సీపీఎం నాయకులు ఆర్‌వీ సత్యనారాయణ, ఎస్.సూర్యకుమార్‌లతో కలిసి మంగళవారం విచారించారు. ఇటువంటి సంఘటనలు జరక్కుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులు సదరు ఉపాధ్యాయుడిపై ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతలపూడి: 132 కేవీ సబ్ స్టేషన్ చింతలపూడి నందు అత్యవసర మెయింటినెన్స్ నిమిత్తం ఈ నెల 28 బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జంగారెడ్డిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని, చింతలపూడి మండల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

కామవరపుకోట: ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని అంబేద్కర్ ఇండియన్ మిషన్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్ కుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగంలో ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్ అనే సదుపాయాలు కేవలం ఆర్థిక పరమైన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ నిపుణులు కల్పించలేదని, సమాజంలో అంటరానితనం అనే దురాచారాన్ని దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్ కల్పించారని, ఈ దురాచారం సమసిపోయే వరకు రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగించాలని, ఆరుగురు న్యాయమూర్తుల అభిప్రాయమైన రిజర్వేషన్ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించి ఎస్సీలకు న్యాయం చేయాలని ఆయన తెలిపారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

కామవరపుకోట: బీజేపీ మహిళా పార్లమెంటు సభ్యురాలు సినీనటి కంగనా రనౌత్ రైతు ఉద్యమంపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, మండల కార్యవర్గ సభ్యులు జి.సత్యనారాయణ, చలమల శ్రీనివాసరావు, స్వామి దాసు, మహిళా సమైక్య నాయకుడు టి.రాములమ్మ, పెండ్లి నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కరేటి నరసింహులు కంగనా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

పరీక్షల టైం టేబుల్ మార్చాలి

చింతలపూడి: పరీక్షల టైం టేబుల్‌ను మార్చాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శులు డి.రాజాబాబు, ఎ.రాము, మండల అధ్యక్ష , కార్యదర్శులు సాలి రాజేంద్రకుమార్, చుండ్రు రాజేంద్రలు విద్యాశాఖాధికారులకు విజ్ఞప్తి చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి వరకు సెల్ఫ్ ఎసెస్‌మెంట్ పరీక్షలు ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించేందుకు షెడ్యూల్ ఇచ్చారన్నారు. అయితే రోజుకు ఒక పరీక్ష నిర్వహించడం వలన సమయం వృథా అవుతుందని, గతంలో మాదిరిగా రెండు పరీక్షలు నిర్వహించేలా పరీక్షల టైంటేబుల్ మార్చాలని కోరారు. అలాగే ప్రతీ రోజు పరీక్ష పేపర్లను గంట ముందు ఎంఈవో కార్యాలయానికి వచ్చి తీసుకువెళ్లాలనే నిబంధనల వలన ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున గతంలో మాదిరిగా స్కూల్ కాంప్లెక్స్ ద్వారా పరీక్షా పత్రాలను క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్‌చే ప్రతీ పాఠశాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి పరీక్షల నిర్వహణను సులభతరం చేయాలని కోరారు.

అక్రమ మద్యం పట్టివేత

వేలేరుపాడు: తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా వేలేరుపాడు మండలంలోని సుద్దగుంపు ప్రాంతంలో పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎడవల్లికి చెందిన మాడి నాగిరెడ్డి అక్రమంగా 20 బీరు బాటిళ్లు తరలిస్తుండగా, సుద్దగుంపు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

మెట్ట రహదారులపై ప్రయాణం నరకమే



చింతలపూడి-సత్తుపల్లి ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గోతులు



చింతలపూడి-టి.నరసాపురం ప్రధాన రహదారి దుస్థితి

భారీ గోతులతో చెరువులను తలపిస్తున్న రోడ్లు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో వర్షాలకు అనేక రోడ్లు దెబ్బ తిన్నాయి. దీంతో ఈ రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా చింతలపూడి ,గురుభట్ల గూడెం రోడ్డు, చింతలపూడి మెయిన్ రోడ్డు , చింతలపూడి సీతానగరం రోడ్డు, ఏలూరు చింతలపూడి ప్రధాన రహదారితో పాటు రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు నుండి కామవరపుకోట, ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారులు పలు ప్రాంతాల్లో వర్షాలకు గోతులు పడి ప్రమాద కరంగా మారాయి. ప్రధాన రహదారులకు సరైన డ్రైనేజీ సదుపాయం లేకపోవడం, రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ రహదారి మార్జిన్లను ఆక్రమించి మట్టి పోయడంతో వర్షపు నీరు రోడ్లపై చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షాలకు రోడ్లపై గుంటల్లో నీరు చేరి, వాహనదారులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు మరమ్మతులకు నిధులు మంజూరు

రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రహదారుల తాత్కాలిక మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరైనట్లు, కొన్ని టెండర్ ప్రక్రియలో ఉన్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ సుందర్‌రావు తెలిపారు. ఏలూరు నుంచి మేడిశెట్టివారిపాలెం రోడ్డు 26వ కిలో మీటర్ నుంచి 40వ కిలో మీటర్ వరకు రూ.40 లక్షలు, 40వ కిలో మీటర్ నుంచి 71వ కిలో మీటర్ వరకు రూ.40 లక్షలు రహదారి మరమ్మతులకు మంజూరయ్యాయని తెలిపారు. చింతలపూడి నుంచి కామవరపుకోట రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.30 లక్షలు, ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు మరమ్మతులకు రూ.24 లక్షలు, రంగాపురం నుంచి కళ్ల చెరువు మీదుగా తడికలపూడి వరకు రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.16 లక్షలు మంజూరయ్యాయని ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నట్లు తెలిపారు.